(జె) "కోర్ డిజిటల్ డేటా అభిరక్షకుడు (సిసిడిడి)" అనగా అట్టి కోర్ డిజిటల్ డేటా యజమానుల తరఫున దానిని కలిగిఉండి యాజమాన్యము వహించు హక్కులు గలిగిన శాసనిక సంస్థ అని అర్థము. మరియు కోర్ డిజిటల్ డేటాను కలిగి ఉండి దానికి యాజమాన్యమును వహించుటకు అట్టి అభిరక్షకునిచే అధిసూచించబడిన ఏజెన్సీలు కూడా చేరియుండును.

(కె) "కోర్ డిజిటల్ డేటా యజమాని (ఓసిడిడి)" లేదా "యజమాని" అనగా వినియమముచే అధిసూచించబడిన సంస్థ అని అర్థము. కోర్ డిజిటల్ డేటాకు యాజమాన్యము వహించి, మరియు దాని నియంత్రణను కలిగిఉండుటకు సంపూర్ణ శాసనిక హక్కులు కలిగిఉండుటకు మరియు అట్టి డేటాను ఉపయోగించు రీతిలో బాధ్యత వహించుటకు ఆ అధిసూచన ద్వారా బాధ్యుడైన వ్యక్తి.

(ఎల్) "కోర్ డిజిటల్ డేటా స్టేవార్డు" అనగా కోర్ డిజిటల్ డేటా సముచిత ఉపయోగం నిమిత్తం, భద్రత గోపనీయత కోసం బాధ్యత వహించుటకు యజమానిచే ఆ పేరుతో హోదా మరియు స్థాయి కల్పించబడిన వ్యక్తి అని అర్థము;

(ఎమ్) "కోర్ డేటా సర్వీసు ఏజెన్సీ (సిడిఎస్ఏ)" అనగా యజమాని ద్వారా నిర్వహించబడిన రీతిలో, ఆయన ఆమోదించిన లేదా నిర్దిష్టపరచిన సర్వీసులను సమకూర్చునిమిత్తము కోర్ డేటా బేస్ ఆధారం గలిగిఉండుటకు యజమాని ద్వారా ప్రాధికార మీయబడిన వ్యవస్థ అని అర్థము.

(ఎన్) "కోర్ సంస్థను గుర్తించేందుకు ఏకైక సంఖ్య (యూనీకోర్)" అనగా వినియమము ద్వారా అధిసూచించబడినట్టి పద్ధతిలో కోర్ సంస్థకు కేటాయించబడిన సంఖ్య అని అర్థము. వేరువేరు రకాలైన కోర్ సంస్థలకు వేరువేరు పద్ధతులను యూనీకోర్ కేటాయించడానికి వేరువేరు పద్ధతులను వినియమముల ద్వారా అధిసూచించవచ్చును.

(ఓ) "సభ్యుడు" 11వ పరిచ్ఛేదము క్రింద నియమించబడిన ప్రాధికార సంస్థ యొక్క ఛైర్‌పర్సన్ మరియు సభ్యుడు చేరియుండును.

(పి) "అధిసూచన" అనగా ఆంధ్రప్రదేశ్ గెజెట్‌లో ప్రచురించబడిన అధిసూచన అని అర్థము మరియు "అధిసూచిత" అనుపద బంధమును దాని వ్యాకరణ రూపాంతరములతో తదనుసారంగా అన్వయించుకొనవలెను.

(క్యూ) "విహితపరచబడిన" అనగా ఈ చట్టము క్రింద రాష్ట్ర ప్రభుత్వము లేదా ప్రాధికార సంస్థచే చేయబడిన నియమముల ద్వారా విహితపరచబడిన అని అర్థము;

(ఆర్) "వినియమములు" అనగా ఈ చట్టము క్రింద ప్రాధికార సంస్థచే చేయబడిన వినియమములు అని అర్థము.

(ఎస్) "అభ్యర్థించు వ్యక్తి" అనగా కోర్ సంస్థ యొక్క యూనీకోర్ సమర్పించు ఏజెన్సీ లేదా వ్యక్తి అని అర్థము, మరియు అధిప్రమాణీకరణ కొరకు కోర్ డిజిటల్ డేటా రీపోజిటరీకి కావలసిన వినియమముల ద్వారా కోరబడునట్టి ఇతర సమాచారము.

(టి) "సర్వీసు" అనగా ఒక వైయక్తిక వ్యక్తి లేదా వైయక్తిక వ్యక్తుల బృందమునకు ఏదేని రూపంలో సమకూర్చబడిన ఏదేని నిబంధన, సదుపాయము, వినియోగిత లేదా ఏదేని ఇతర సహాయము అని అర్థము.

## అధ్యాయము -2

## కోర్ డిజిటల్ డేటా సేకరణ

యూనికోర్ సంఖ్యను అధిసూచించుట.

3. (1) రాష్ట్రంలోని ప్రతి కోర్ సంస్థ, వినియమములో అధిసూచించబడనట్టి ప్రక్రియను అనుసరిస్తూ, కోర్‌డేటా వసూలు ప్రక్రియ ద్వారా యూనికోర్ సంఖ్య కేటాయించబడవలెను.

(2) కోర్ డేటా సేకరించు ఏజెన్సీ (సిడిసిఏ), కోర్‌డేటాను సేకరించు సమయములో వినియమములచే నిర్దిష్టపరచబడునట్టి రీతిలో ఈ క్రింది వివరములను కోర్ సంస్థ లేదా యజమాని తెలియజేయవలెను, అవేవనగా,-

(ఎ) డేటాను ఉపయోగించవలసిన రీతి;

(బి) డేటా భాగమును పంచుకోవలసి యుండునట్టి గ్రహీతల స్వభావము;

(సి) డేటాను యాక్సెస్ కలిగి ఉండుటకు హక్కు, అట్టి యాక్సెస్ కొరకు అభ్యర్థనలు చేయు ప్రక్రియ మరియు అట్టి అభ్యర్థనలు చేయవలసి ఉండునట్టి వ్యక్తి లేదా శాఖకు ఇన్‌ఛార్జి యొక్క వివరములు.

(3) ఉపపరిచ్ఛేదము (1) క్రింద కోర్ డేటాను స్వీకరించిన మీదట ప్రాధికార సంస్థ, వినియమములచే నిర్దిష్టపరచబడునట్టి రీతిలో డేటాను సరిచూచిన మీదట, సదరు కోర్ సంస్థకు యునీకోర్ సంఖ్యకు కేటాయించవలెను.

యూనీకోర్ సంఖ్య యొక్క లక్షణములు.

4. (1) ఒక కోర్ సంస్థకు కేటాయించబడిన యూనీకోర్ సంఖ్యను ఏదేని ఇతర సంస్థకు తిరిగి కేటాయించరాదు;

(2) యూనీకోర్ సంఖ్య, ప్రాధికార సంస్థ అధిసూచించునట్టి లక్షణాలతో అట్టి ప్రరూపంలో ఉండవలెను. మరియు దాని సంబంధిత కోర్ సంస్థను సులభంగా గుర్తించబడదగి ఉండవలెను. ప్రాధికార సంస్థ, వేరువేరు కోర్ సంస్థలకు వేరువేరు పద్ధతులలో వేరువేరు ప్రరూపములను మరియు వేరువేరు లక్షణములను అధిసూచించవచ్చును. ప్రాధికార సంస్థ వివిధ కేటగిరీల యూనికోర్ సంఖ్యలను సముచితమైనట్టి ప్రత్యేకమైన పేర్లను కూడా కేటాయించవచ్చును.

(3) వినియమము ద్వారా నిర్దిష్టపరచబడునట్టి విధముగా అధిప్రమాణీకరణ మరియు ఇతర షరతులకు లోబడి భౌతిక లేదా ఎలక్ట్రానిక్ ప్రరూపంలో ఉండి, దాని స్థలము నిర్దిష్టమైన కోర్ సంస్థ ఉనికికి సాక్ష్యముగా స్వీకరించబడదగి ఉండవలెను.

విశదీకరణ :- ఈ ఉప-పరిచ్ఛేదము నిమిత్తము, "ఎలక్ట్రానిక్ ప్రరూపము" అను పద బంధము సాంకేతిక సమాచార చట్టము, 2000 యొక్క 2వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (1) లోని ఖండము (ఆర్)లో దానికి ఇవ్వబడిన అర్థమునే కలిగి ఉండును. 2000లోని 21వ చట్టము.

కొన్ని కేటగిరీల వ్యక్తులకు యూనీకోర్ సంఖ్యను జారీ చేయుటకు ప్రత్యేక చర్యలు.

5. (1) వినియమముల ద్వారా నిర్దిష్టపరచబడునట్టి రీతిలో ప్రాధికార సంస్థ ఆయాసమయములందు అభ్యర్థించు కోర్ సంస్థలు లేదా వాటి యజమానులు, తమ డేటాను ఆ తేదీవరకు సవరించవలసినదని కోరవచ్చును. అందువలన, కోర్ డిజిటల్ డేటా రిపోజిటరీలోని తమ సమాచారము నిరంతరమైన ఖచ్చితత్వాన్ని కలిగిఉండుటకు వీలవుతుంది.

(2) ప్రాధికార సంస్థ కోర్‌డేటా మరియు అమలు కచ్చితంగా ఉండేందుకు వీలుగా సముచితమైన వినియమములో నిర్దిష్టపరచబడునట్టి చర్యలను కూడా తీసుకొనవలెను.

## అధ్యాయము - 3

## కోర్ సంస్థ యొక్క అధిప్రమాణీకరణ

సర్వీసులు స్వీకరించేందుకు అవసరమైన యూనికోర్ రుజువు.

6. రాష్ట్ర ప్రభుత్వము, కోర్‌డేటా అభ్యర్థించునట్టి వ్యక్తి సర్వీసును స్వీకరించు నిమిత్తము ఒక షరతుగా గుర్తింపునకు మరియు కోర్ సంస్థ లక్షణములు వ్యవస్థితముగావించేందుకు, అట్టి కోర్ సంస్థ అధిప్రమాణీకరణకు లోనుకావలెనని, లేదా యూనీకోర్ సంఖ్య కలిగి ఉన్నట్లు రుజువు సమర్పించవలసినదని లేదా యూనికోర్ సంఖ్య కేటాయించబడని సంస్థ విషయంలో అట్టి సంస్థ లేదా సందర్భానుసారము దాని యజమాని యూనీకోర్ సంఖ్య జారీకొరకు దరఖాస్తు చేసుకొనవలసినదని ప్రభుత్వము కోరవచ్చును.

అయితే, ఒక సంస్థకు యూనీకోర్ సంఖ్య కేటాయించబడనపుడు, సదరు సంస్థకు లేదా సందర్భానుసారం దాని యజమానికి ప్రత్యామ్నాయాన్ని ఇవ్వజూపి సర్వీసు డెలివరీ కొరకు గుర్తింపు సాధనములను సమకూర్చవలెను.

యూనీకోర్ సంఖ్య అధిప్రమాణీకరణ.

7. (1) ప్రాధికార సంస్థ, వినియమములచే నిర్దిష్టపరచబడునట్టి రీతిలోను మరియు అట్టి ఫీజు చెల్లించిన మీదటను మరియు అట్టి షరతులకు లోబడి, తన కోర్‌డేటాకు సంబంధించి అభ్యర్తించినట్టి ఎవరేని వ్యక్తి సమర్పించిన కోర్ సంస్థ యొక్క యూనీకోర్ సంఖ్య అధిప్రమాణీకరణను ప్రాధికార సంస్థ నిర్వర్తించవలెను.

(2) అభ్యర్థించు వ్యక్తి,-

(ఎ) ఈ చట్టములో ఇతర విధముగా నిబంధించబడిననే తప్ప, వినియమములచే నిర్దిష్ట పరచబడునట్టి రీతిలో అధిప్రమాణీకరణ

నిమిత్తము కోర్ డేటాను సేకరించుటకు ముందు సంస్థ యొక్క అనుమతిని పొందవలసి ఉండును; మరియు

(బి) అధిప్రమాణీకరణ కొరకు, కోర్ డిజిటల్ డేటా రిపోజిటరీ సమర్పణకు మాత్రమే, సంస్థ యొక్క కోర్ డేటాను ఉపయోగించవలసి ఉంటుంది.

(3) అభ్యర్థించిన వ్యక్తి, వినియమములచే నిర్దిష్ట పరచబడునట్టి రీతిలో, అధిప్రమాణీకరణ విషయంలో ఈ క్రింది వివరములను తన కోర్ డేటాను సమర్పించు సంస్థకు తెలియజేయవలెను అవేవనగా,-

(ఎ) అధిప్రమాణీకరణపై పాలుపంచుకొనబడదగినట్టి సమాచారపు స్వభావము;

(బి) అభ్యర్థించు వ్యక్తి, అధిప్రమాణీకరణ సమయంలో స్వీకరించిన సమాచారపు ఉద్దేశిత ఉపయోగము;

(సి) అభ్యర్థించిన వ్యక్తికి, కోర్‌డేటా సమర్పరణకు మారుగా ప్రత్యామ్నాయాలు;

(4) అట్టి కోర్ డేటాను పాలుపంచుకొనుటలో సామరస్య పూర్వకముగా లేదా వ్యతిరేక పూర్వకంగా లేదా ఏదేని ఇతర సముచితమైన రీతిలో ప్రాధికార సంస్థ ప్రతిస్పందించవలెను.

స్వామ్యత్వమునకు లేదా హక్కులకు యూనీకోర్ సంఖ్య రుజువుగా ఉండదు.

8. యూనీకోర్ సంఖ్య లేదా దానియొక్క అధిప్రమాణీకరణ మాత్రముననే, కోర్ సంస్థ విషయములో ఎట్టి హక్కు ఒసగబడదు లేదా యాజమాన్యము లేదా హక్కులకు రుజువుగా ఉండబోదు.

కోర్ డిజిటల్ డేటా రిపోజిటరీ

9. ప్రాధికార సంస్థ, కోర్ డిజిటల్ డేటా రిపోజిటరీని ఏర్పాటుచేసి, నిర్వహించుటకు ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సంస్థలను నియోగించవచ్చును. మరియు వినియమములచే నిర్దిష్టపరచబడునట్టి ఏవేని ఇతర కృత్యములను నిర్వర్తించవచ్చును.

## అధ్యాయము - 4

## కోర్ డిజిటల్ డేటా ప్రాధికార సంస్థ

ప్రాధికార సంస్థ ఏర్పాటు.

10. (1) రాష్ట్ర ప్రభుత్వం, అధిసూచన ద్వారా "ఆంధ్రప్రదేశ్ కోర్ డిజిటల్ డేటా ప్రాధికారసంస్థ" అని పిలువబడే ఒక ప్రాధికార సంస్థను ఏర్పాటుచేయవలెను. పాత కోర్ డేటాకు చెందిన సేకరణ ప్రక్రియలు, ప్రసారం, స్టోరేజి మరియు అభ్యర్ధనపై దాని యొక్క అధిప్రమాణీకరణలను విహితపరచేందుకు మరియు ఈ చట్టం క్రింద నియతంచేయబడినట్టి ఇతర కృత్యములను నిర్వర్తించుటకు ఇది బాధ్యత వహిస్తుంది.

(2) ప్రాధికార సంస్థ పైన పేర్కొన్నట్టి పేరుతో ఒక నిగమిత సంస్థగా ఉండవలెను. అది, ఆస్తిని ఆర్జించు, కలిగిఉండు, వ్యయనంచేయు అధికారముతో శాశ్వత ఉత్తరాధికారమును సామాన్య మొహరును కలిగియుండి మరియు చర, స్థిరాస్తులు రెండింటిని కలిగి ఉండవలెను. సదరు నిగమిత సంస్థ పేరుతో అది దావాలు వేయవచ్చును లేదా దావాలు వేయబడవచ్చును.

(3) ప్రాధికార సంస్థ ప్రధాన కార్యాలయము అమరావతిలో ఉండవలెను.

(4) ప్రాధికార సంస్థ, రాష్ట్ర ప్రభుత్వ ముందస్తు ఆమోదంతో తన కార్యాలయాలను రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో ఏర్పాటు చేయవచ్చును.

ప్రాధికార సంస్థ సంరచన.

11. ప్రాధికార సంస్థ, పాక్షిక కాలం లేదా పూర్తికాలిక ప్రాతిపదికపై నియమించబడిన ఒక ఛైర్ పర్సన్‌ను, ముగ్గురు పాక్షిక కాలంపాటు సభ్యులను మరియు ప్రభుత్వంచే నియమించబడునట్టి ముఖ్య కార్యనిర్వహక అధికారి, ప్రాధికార సంస్థకు సభ్యకార్యదర్శిగా ఉండవలెను.

ప్రాధికార సంస్థ ఛైర్‌పర్సన్ మరియు సభ్యుల నియామకానికి అర్హతలు.

12. ప్రాధికార సంస్థ ఛైర్‌పర్సన్ మరియు సభ్యులు సమర్థత మరియు చిత్తశుద్ధి కలిగిన వ్యక్తులైఉండి, సాంకేతిక పరిజ్ఞానం, పరిపాలన, శాసనం అభివృద్ధి, ఆర్థికశాస్త్రం, ఆర్థిక, నిర్వహణ, ప్రజా వ్యవహారాలు లేదా పరిపాలనకు సంబంధించిన విషయాలలో కనీసం పది సంవత్సరాల అనుభవంను మరియు పరిజ్ఞానాన్ని కలిగి ఉండవలెను.

ఛైర్‌పర్సన్‌ల మరియు సభ్యుల పదవీకాలం మరియు ఇతర సర్వీసు షరతులు.

13. (1) ఈ చట్టం క్రింద నియమించబడిన ఛైర్‌పర్సన్ మరియు సభ్యులు వారు పదవిని చేపట్టిన తేదీ నుండి 3 సంవత్సరముల కాలావధికి పదవిని కలిగి ఉంటారు. మరియు పునర్నియామకానికి వారు అర్హత కలిగి ఉంటారు. అయితే, ఛైర్ పర్సన్ లేదా సభ్యులు 65 సంవత్సరాల వయస్సు నిండిన తరువాత పదవిలో కొనసాగరాదు.

(2) ఛైర్‌పర్సన్ మరియు ప్రతీ సభ్యుడు పదవిని చేపట్టడానికి ముందు విహిత పరచబడునట్టి ప్రరూపం మరియు రీతిలో అట్టి ప్రాధికారి ముందు పదవీ స్వీకార మరియు రహస్యపాలన ప్రమాణాన్ని చేసి సంతకం చేయవలెను.

(3) ఉపపరిచ్ఛేదం (1)లో ఏమి ఉన్నప్పటికీ, ఛైర్‌పర్సన్ లేదా సభ్యులు-

(ఎ) 30 రోజులకు తక్కువ కాకుండా, వ్రాత పూర్వకంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఒక నోటీసును ఇవ్వడం ద్వారా తన పదవిని విడిచిపెట్టవచ్చును; లేదా

(బి) 14వ పరిచ్ఛేదంలోని నిబంధనల ప్రకారం ఆయన పదవి నుండి వైదొలగవచ్చును.

(4) ఛైర్‌పర్సన్‌కు చెల్లించదగు జీత భత్యాలు మరియు ఇతర నిబంధనలు, షరతులు మరియు పాక్షికకాలం సభ్యులకు చెల్లించదగు పారితోషకం లేదా భత్యాలు విహితపరచబడిన విధంగా ఉండవలెను.

ఛైర్‌పర్సన్ మరియు సభ్యుల తొలగింపు.

14. (1) ప్రభుత్వం, ఛైర్‌పర్సన్ లేదా సభ్యుడు ఎవరైనా,-

(ఎ) దివాలాదారుగా ఉన్నప్పుడు లేదా ఏ సమయంలోనైనా దివాలాదారుగా తీర్మానించబడినపుడు;

(బి) ఛైర్‌పర్సన్‌గా లేదా సందర్భానుసారం సభ్యుడుగా పనిచేయడానికి భౌతికంగానూ లేదా శారీరకంగానూ, అశక్తుడైనపుడు;

(సి) ప్రభుత్వ అభిప్రాయంలో నీతిబాహ్యతతో కూడిన ఏదైనా అపరాధమునకు దోష స్థాపితుడైనపుడు;

(డి) ఛైర్‌పర్సన్‌గా లేదా సందర్భాన్నిబట్టి ఒక సభ్యునిగా తన కృత్యములకు ప్రతికూలంగా పరిణమించదగు ఆర్థిక పరమైనట్టి లేదా ఇతర ప్రయోజనాన్ని పొందినపుడు; లేదా

(ఇ) ప్రజా హితమునకు హానికరమైన విధంగా అతను పదవిలో కొనసాగినందున పదవిని దుర్వినియోగ పరచినట్లుగా ప్రభుత్వం భావించినపుడు అతనిని పదవినుండి తొలగించవచ్చును.

(2) విన్నవించుకొనుటకు తగిన అవకాశాన్ని ఇచ్చిననే తప్ప, ఉపపరిచ్ఛేదం (1)లోని ఖండం(బి), ఖండం(డి) లేదా ఖండం (ఇ) క్రింద ఛైర్‌పర్సన్ లేదా సభ్యుడు తొలగించబడరాదు.

పదవీ విరమణ తరువాత ఉపాధిపై ఛైర్ పర్సన్స్ లేదా సభ్యులపై నిర్బంధన.

15. ఛైర్‌పర్సన్ లేదా ఒక సభ్యుడు ఏ కారణంచేతనైనా పదవిని విరమించినమీదట, రాష్ట్ర ప్రభుత్వ పూర్వానుమతి లేకుండా,-

(ఎ) అతను పదవిని విరమించిన తేదీ నుండి మూడు సంవత్సరముల కాలావధికి గానూ, ఛైర్‌పర్సన్ లేదా సభ్యుడిగా సందర్భాన్ని బట్టి తన పదవీకాలంలో ప్రత్యక్షంగా గాని లేదా పరోక్షంగా గాని, ప్రాధికార సంస్థచే చేయబడిన లేదా కరారు చేయబడిన ఏదేని పనితో సంబంధం ఉన్నట్టి ఏదేని సంస్థ, కంపెనీ లేదా ఏవేని ఇతర సంస్థకు చెందిన యాజమాన్యంలో ఏదేని ఉపాధిని అంగీకరించరాదు లేదా ఏ విధంగాను సంబంధాన్ని కలిగిఉండరాదు.

2013లో 18వ చట్టం.

అయితే, ఈ ఖండంలోనిదేదియు, రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్రప్రభుత్వం లేదా స్థానిక ప్రాధికార సంస్థ క్రింద లేదా ఏదేని చట్టబద్ధమైన ప్రాధికార సంస్థ లేదా ఏదేని కేంద్ర, రాష్ట్ర లేక ప్రాంతీయ చట్టం ద్వారా లేదా క్రింద ఏర్పాటు చేయబడిన ఏదేని కార్పొరేషను లేదా కంపెనీల చట్టం, 2013 యొక్క 2వ పరిచ్ఛేదపు ఖండం (45)లో నిర్వచించబడినట్లుగా ఒక ప్రభుత్వ కంపెనీ క్రింద ఏదేని ఉపాధికి వర్తించదు;

(బి) ఏదేని నిర్దిష్టమైన ప్రొసీడింగు లేదా వ్యవహారం లేదా సంప్రదింపు లేదా ప్రాధికార సంస్థ కక్షిదారుగా ఉన్నట్టి ఒక కేసుకు సంబంధించి మరియు పదవీవిరమణకు ముందు ఛైర్‌పర్సన్ లేదా అట్టి సభ్యుడు ప్రాధికార సంస్థకు పనిచేసిన లేదా సలహా నివ్వడానికి సంబంధించి ఎవరేని వ్యక్తి లేదా సంస్థ తరఫున పనిచేయరాదు;

(సి) ఛైర్‌పర్సన్ లేదా సభ్యుని హోదాలో మరియు ప్రజలకు లభ్యంగా లేకుండా లేదా లభ్యంగా ఉండేటట్లు చేయబడటానికి వీలు లేకుండా పొందిన సమాచారాన్ని ఉపయోగిస్తూ ఏ వ్యక్తికీ సలహాను ఇవ్వరాదు; లేదా

(డి) కార్యాలయంలో అతని చివరి రోజు నుండి మూడు సంవత్సరముల కాలావధికి సేవా ఒప్పందం చేసుకోరాదు. డైరెక్టర్ల బోర్డు నియామకానికి అంగీకరించరాదు. లేదా అతని పదవీకాలంలో అతను ప్రత్యక్షంగానూ, ప్రముఖంగాను అధికార వ్యవహారాలను కలిగిఉన్నట్టి సంస్థ ఇవ్వజూపు ఉద్యోగాన్ని అంగీకరించరాదు;

16. ప్రాధికార సంస్థ సమావేశాలకు ఛైర్‌పర్సన్ అధ్యక్షత వహించవలెను. చట్టంలోని ఏదేని నిబంధనకు భంగం వాటిల్లకుండా విహితపరచబడునట్టి ప్రాధికార సంస్థ ఇతర అధికారాలను, వినియోగించవలెను మరియు కృత్యములను నిర్వర్తించవలెను. ఛైర్‌పర్సన్ కృత్యములు.

17. (1) రాష్ట్ర ప్రభుత్వంచే నియమించబడు సంయుక్త కార్యదర్శి హోదాకు తక్కువ కాని వ్యక్తి ప్రాధికార సంస్థకు ముఖ్య కార్యనిర్వహక అధికారిగా ఉండవలెను. ముఖ్య కార్యనిర్వాహక అధికారి.

(2) ముఖ్య కార్యనిర్వాహక అధికారి, ప్రాధికార సంస్థకు శాసనిక ప్రతినిధిగా ఉండి ఈ క్రింది వాటికి బాధ్యత వహించవలెను,-

(ఎ) ప్రాధికార సంస్థ రోజువారీ పరిపాలనకు;

(బి) ప్రాధికార సంస్థ ఆమోదించిన పని కార్యక్రమాలను మరియు నిర్ణయాలను అమలు చేయడానికి;

(సి) ప్రాధికార సంస్థ నిర్ణయాలను, పని కార్యక్రమాల కొరకు ప్రతిపాదనను తయారు చేయడానికి;

(డి) ఆదాయం మరియు వ్యయానికి సంబంధించిన వివరణను తయారు చేయడానికి మరియు ప్రాధికార సంస్థ బడ్జెట్‌ను తయారుచేయడానికి;

(ఇ) వినియమములచే నిర్దిష్టపరచబడునట్టి ఇతర కృత్యములను నిర్వర్తించడానికి మరియు ఇతర అధికారాలను వినియోగించడానికి,-

వ్యవహరించవలెను.

(3) ముఖ్య కార్యనిర్వాహక అధికారి ప్రతి సంవత్సరం,-

(ఎ) గత సంవత్సరంలో ప్రాధికార సంస్థ యొక్క కార్యకలాపాలన్నింటికీ సంబంధించిన ఒక సాధారణ నివేదికను;

(బి) పని కార్యక్రమాలు;

(సి) గత సంవత్సరానికి వార్షిక అకౌంట్లు; మరియు

(డి) రాబోవు సంవత్సరానికి బడ్జెట్.ఆమోదము కొరకు ప్రాధికార సంస్థకు సమర్పించవలెను.

ప్రాధికార సంస్థ సమావేశాలు

18. (1) వినిమయములచే నిర్దిష్టపరచబడునట్టి సమయాలలో మరియు ప్రదేశాలలో ప్రాధికార సంస్థ స ుతో సహా తన సమావేశాల వ్యవపాల లావాదవలకు సంబంధంచ అట్ట ప్రక్రయి నియిమములు పాటించవలెను.

(2) ఏ కారణంచేతనైన ఛైర్‌పర్సన్ ప్రాధికార సంస్థ సమావేశమునకు హాజరు కాలేకపోయినట్లైతే, అత్యంత సీనియర్ సభ్యుడు ప్రాధికార సంస్థ సమావేశాలకు అధ్యక్షత వహించవలెను.

(3) ప్రాధికార సంస్థ ఏదేని సమావేశం సమక్షమునగల అన్ని ప్రశ్నలను సమావేశమునకు హాజరై, ఓటింగులో పాల్గొన్న సభ్యుల మెజారిటి ఓట్ల ద్వారా నిర్ణయించబడవలెను. ఓట్లు సమానంగా వచ్చిన సందర్భంలో చైర్‌పర్సన్ లేదా ఆయన హాజరులో లేనపుడు అధ్యక్షతవహించే సభ్యుడు నిర్ణాయక ఓటును కలిగిఉండవలెను.

(4) ఎవరేని సభ్యుడు, ఒక కంపెనీకి డైరెక్టరుగా ఉండి మరియు అట్టి డైరెక్టరుగా ఏ రీతిలోనైనా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ధనసంబంధమైన ప్రయోజనాన్ని కలిగిఉన్నట్టి విషయం ప్రాధికార సంస్థ సమావేశంలో పరిశీలనకు వచ్చినపుడు సంబంధిత పరిస్థితులు అతనికి తెలియవచ్చిన తరువాత, వీలైనంత త్వరగా అట్టి సమావేశంలో తన ప్రయోజన స్వభావాన్ని వెల్లడించవలెను. మరియు అట్టి వెల్లడిని ప్రాధికార సంస్థ ప్రోసీడింగులలో రికార్డు చేయాలి. అట్టి విషయానికి సంబంధించి, ప్రాధికార సంస్థకు చెందిన ఏదేని సమాలోచన లేదా నిర్ణయ ప్రక్రియలో సదరు సభ్యుడు పాల్గొనకూడదు.

ప్రాధికార సంస్థ అధికారులు ఇతర ఉద్యోగులు

19. (1) ప్రాధికార సంస్థ, తన కృత్యములను నిర్వర్తించుటలో అవసరమైన ఇతర అధికారులు మరియు ఉద్యోగుల సంఖ్య, స్వభావం మరియు కేటగిరీలను ప్రభుత్వ ఆమోదంతో నిర్ధారించవచ్చును.

(2) ప్రాధికార సంస్థకు చెందిన ముఖ్య కార్యనిర్వాహక అధికారి, ఇతర అధికారులు మరియు ఇతర ఉద్యోగులకు చెల్లించదగు జీత, భత్యములు మరియు ఇతర సర్వీసు నిబంధనలు, షరతులు ప్రభుత్వ ఆమోదముతో వినియములలో నిర్దిష్టపరచుబడునట్టి విధంగా ఉండవలెను.

20. (1) ఈ చట్టం క్రింద, ప్రాధికార సంస్థ, కోర్ సంస్థలకు 'యూనీకోర్' సంఖ్యలను జారీచేయడం కొరకు ఒక విధానాన్ని, ప్రక్రియను, వ్యవస్థలను అభివృద్ధిచేసి, అందుకు సంబంధించిన అధి ప్రామాణీకరణను గావించవలెను. ప్రాధికార సంస్థ అధికారములు మరియు కృత్యములు.

(2) ఉపపరిచ్ఛేదం (1)కి భంగం వాటిల్లకుండా, ప్రాధికార సంస్థ యొక్క అధికారములు, కృత్యములు ఇతర విషయములతో పాటు ఈ క్రిందివి చేరి ఉండును, అవేవనగా,-

(ఎ) వినియమములచే నిర్దిష్టపరచబడునట్టియు యూనీకోర్ సంఖ్య జారీకి మరియు దాని సేకరణ ప్రక్రియలు, దానిని పరిచూచుటకు;

(బి) వినియమముల ద్వారా నిర్దిష్ట పరచబడునట్టి రీతిలో కోర్ డేటాను సేకరించుట;

(సి) కోర్ డిజిటల్ డేటా రిపోజిటరీని నిర్వహించుటకు ఒకటి లేదా అంతకంటె ఎక్కువ సంస్థలను నియమించుట;

(డి) కోర్ సంస్థలకు, యూనీకోర్ సంఖ్యలను సృష్టించి, వాటిని కేటాయించుట;

(ఇ) యూనికోర్ సంఖ్యల ప్రమాణీకరణ నిర్వహించడం.

(ఎఫ్) వినియమములచే నిర్దిష్టపరచబడనట్టి రీతిలో కోర్ డిజిటల్ డేటా రిపోజిటరీలోని కోర్ డేటాను నిర్వహించి ఆ తేదీ వరకు సవరించుట;

(జి) వినియమముల ద్వారా నిర్దిష్టపరచబడునట్టి రీతిలోయూనీకోర్ సంఖ్యను, అందుకు సంబంధించిన సమాచారమును వదిలివేయుట మరియు నిస్తేజము చేయుట;

(హెచ్) కోర్ డేటాను, వివిధ సర్వీసులకు వినియోగించుట, అది ఉపయోగించదగు రీతిని నిర్దిష్టపరచుట;

(ఐ) కోర్డేటా సేకరణ ఏజన్సీల మరియు సర్వీసు ప్రొవైడర్ల నియామకము మరియు వాటి నియామకముల రద్దు కొరకు, షరతులు మరియు నిబంధనలను వినియమముల ద్వారా నిర్దిష్టపరచుట;

(జె) ఈ చట్టములోని నిబంధనలకు లోబడి, వినియమముల ద్వారా నిర్దిష్టపరచరబడునట్టి రీతిలో కోర్ డేటాను పంచుకోవడం;

(కె) ఈ చట్టపు ప్రయోజనముల నిమిత్తము, కోర్ డిజిటల్ డేటా రిపోజిటరీ, కోర్ డేటా సేకరణ ఏజెన్సీలు మరియు ఈ చట్టము క్రింద నియమించబడిన ఇతర ఏజెన్సీల రికార్డులను మరియు సమాచారమును తనిఖీలు, విచారణలు మరియు ఆడిట్ నిర్వహణ కొరకు కోరుట;

(ఎల్) ఈ చట్టము క్రింద డేటా మేనేజ్‌మెంట్, భద్రత ప్రాధాన్యత, మరియు ఇతర సాంకేతిక భద్రతలకు సంబంధించి వివిధ ప్రక్రియలను వినియమముల ద్వారా నిర్దిష్టపరచుట;

(ఎమ్) ఈ చట్టము క్రింద, వినియమములచే విహితపరచబడునట్టి రీతిలో యజమానులు, కోర్ డేటా సేకరణ ఏజెన్సీలు లేదా ఇతర సర్వీసు ప్రొవైడర్లు వారు సమకూర్చిన సేవలకు ఫీజులు విధించి వసూలు చేయుటకు ప్రాధికారమిచ్చుట.

(ఎన్) సరియైన యాంత్రిక విధానం ద్వారా యూనికోర్ సంఖ్యల వినియోగంతో సహా డేటా మేనేజ్‌మెంట్ మరియు సంబంధిత రంగాలలో పురోగతి నిమిత్తం పరిశోధనను పెంపొందించి అభివృద్ధి పరచుట;

(ఓ) విహితపరచబడునట్టి ఇతర అధికారములు మరియు కృత్యములు.

## అధ్యాయము - 5

## గ్రాంట్లు, అక్కౌంట్లు మరియు ఆడిట్ మరియు వార్షిక నివేదిక

రాష్ట్రప్రభుత్వముచే గ్రాంట్లు.

21. రాష్ట్ర ప్రభుత్వము, ఈ చట్టపు ప్రయోజనముల నిమిత్తము తాను ఉచితమని భావించునట్టి పైకములను ప్రాధికార సంస్థకు గ్రాంటుచేయవచ్చును.

అక్కౌంట్లు మరియు ఆడిటు.

22. (1) ప్రాధికార సంస్థ సరైన అక్కౌంట్లను మరియు ఇతర సంబంధిత రికార్డులను నిర్వహించవలెను మరియు ప్రభుత్వముచే విహితపరచబడునట్టి ప్రరూపంలో అక్కౌంట్ల వార్షిక వివరణను తయారు చేయవలెను.

(2) ప్రాధికార సంస్థ యొక్క అక్కౌంట్లను, కంప్ట్రోలరు మరియు భారత ఆడిటరు జనరలు, ఆయన నిర్దిష్టపరచునట్టి అంతరావధులలో వార్షికముగా ఆడిట్ చేయబడవలెను. మరియు ఆడిట్‌కు సంబంధించి చేసిన ఏదేని వ్యయమును ప్రాధికార సంస్థ కంప్ట్రోలరు మరియు ఆడిటరు జనరల్‌కు తిరిగి చెల్లించవలెను.

(3) ప్రాధికార సంస్థ ఈ క్రింది వాటిని సమకూరుస్తూ ప్రతి సంవత్సరములో ఒకసారి, విహితపరచబడునట్టి సమయములో మరియు అట్టి రీతిలో మరియు అట్టి ప్రరూపంలో వార్షిక నివేదికను తయారుచేయవలెను,-

(ఎ) గత సంవత్సరపు ప్రాధికార సంస్థ యొక్క కార్యకలాపాల వివరణ;

(బి) గత సంవత్సరపు వార్షిక అక్కౌంట్లు; మరియు

(సి) రాబోవు సంవత్సరమునకు కార్యక్రమములు.

(4) ఉపపరిచ్ఛేదము (2) క్రింద స్వీకరించిన నివేదిక ప్రతినొక దానిని రాష్ట్ర ప్రభుత్వము సాధ్యమైనంత వెంటనే శాసనమండలి ఉభయ సదనముల సమక్షమున ప్రవేశపెట్టవలెను.

## అధ్యాయము - 6

## కోర్ డిజిటల్ డేటా పరిరక్షణ మరియు నిర్వహణ

సమాచారము యొక్క భద్రత మరియు గోపనీయత.

23. (1) ప్రాధికార సంస్థ, కోర్ డిజిటల్ డేటాకు భద్రత మరియు దాని రికార్డుల అధిప్రమాణీకరణకు బాధ్యత వహించవలెను.

(2) ప్రాధికార సంస్థ ఈ చట్టపు నిబంధనలకు లోబడి, ప్రస్తుతము అమలు నందున్న శాసనము ద్వారా అట్టి సమాచారము పబ్లికు రికార్డుగా రూఢి ప్రకటన చేయబడిననే తప్ప, కోర్ డేటా మరియు కోర్ సంస్థల రికార్డుల అధిప్రమాణీకరణ గోపనీయతను పాటించవలెను.

(3) ప్రాధికార సంస్థ స్వామ్యములో లేదా దాని నియంత్రణలో గల సమాచారము నిశ్చయపరచుటకు అవసరమైన అన్ని చర్యలను తీసుకొనవలెను. వీటిలో కోర్ డిజిటల్ డేటా రిపోజిటరీలో నిల్వచేసిన సమాచారముతో సహా ఈ చట్టము క్రింద లేదా అందు చేయబడిన వినియమముల క్రింద అనుమతించబడని ఉపయోగము లేదా వెల్లడి చేయుటలో మరియు ప్రమాదవశాత్తు లేదా ఉద్దేశపూర్వకముగా ధ్వంసముచేయు, నష్టము లేదా హాని నుండి భద్రత మరియు పరిరక్షణ విషయములు చేరియుండును.

(4) ఉపపరిచ్ఛేదములు (1) మరియు (2)లకు భంగము వాటిల్లకుండా ప్రాధికార సంస్థ,-

(ఎ) సముచితమైన సాంకేతిక మరియు వ్యవస్థాపరమైన భద్రత చర్యలను అవలంబించి అమలుచేయుట;

(బి) ఈ చట్టము క్రింద ప్రాధికార సంస్థ యొక్క ఏదేని కృత్యమును నిర్వర్తించుటకు నియమించబడిన లేదా నియోగించబడిన ఏజెన్సీలు, సంప్రదింపుదారులు, సలహాదారులు లేదా ఇతర వ్యక్తులు, సమాచారము నిమిత్తము సముచితమైన సాంకేతిక మరియు వ్యవస్థాపరమైన భద్రత చర్యలలో పాలుపంచుకొనవలెను; మరియు

(సి) ఈ చట్టము క్రింది వాటితో సమానమైన బాధ్యతలను ప్రాధికార సంస్థపై విధించబడు అట్టి ఏజెన్సీలు, సంప్రదింపుదారులు, లేదా ఇతర వ్యక్తులతో కుదుర్చుకొనిన కరారులు, లేదా ఏర్పాట్లు, ప్రాధికార సంస్థ నుండి వచ్చిన సూచనలపై మాత్రమే అట్టి ఏజెన్సీలు సంప్రదింపుదారులు, సలహాదారులు మరియు ఇతర వ్యక్తులు పనిచేయవలసి ఉంటుంది.

(5) ప్రస్తుతము అమలునందున్న ఏదేని ఇతర శాసనములో ఏమి ఉన్నప్పటికిని మరియు ఈ చట్టములో ఇతర విధముగా నిబంధించబడిననే తప్ప, ప్రాధికార సంస్థ లేదా ఎవరేని దాని యొక్క అధికారులు, లేదా ఇతర ఉద్యోగులు లేదా కేంద్రీయ గుర్తింపుల డేటా రిపోజిటరీని నిర్వహించు ఏదేని ఏజెన్సీ, తన సర్వీసు కాలంలో లేదా అటు తరువాత కోర్ డిజిటల్ డేటా రిపోజిటరీ లేదా అధిప్రమాణీకరించబడిన రికార్డులో నిల్వ చేసిన ఏదేని సమాచారమును ఎవరికిని వెల్లడి చేయరాదు.

కోర్ డేటాను పాలుపంచుకోవడంలో నిర్బంధన.

24. ఈ చట్టము క్రింద సేకరించిన లేదా సృష్టించిన కోర్‌డేటాలో, ఈ చట్టపు నిబంధనలను అనుసరించి మరియు వినియమములచే నిర్దిష్టపరచబడునట్టి రీతిలో మాత్రమే పాలుపంచుకొనవచ్చును.

కోర్ డేటాను మార్పు చేయుట.

25. (1) ఏదేని కోర్ డేటా సరైనది కాదని కనుగొనబడినవుడు లేదా దరిమిలా మార్పు చెందినపుడు, యూనికోర్ సంఖ్యను కలిగిన వ్యక్తి, వినియమములచే నిర్దిష్టపరచబడునట్టి రీతిలో కోర్ డిజిటల్, డేటా రిపోజిటరీలో గల అట్టి డేటాను మార్పుచేయవలసినదని ప్రాధికార సంస్థను కోరవచ్చును.

(2) ఉపపరిచ్ఛేదము (1) క్రింద ఏదేని అభ్యర్థనను స్వీకరించిన మీదట, ప్రాధికార సంస్థ, తాను సంతృప్తి చెందినట్లయితే, అట్టి సంస్థకు చెందిన రికార్డులో, కోరబడినట్టి మార్పును చేయవచ్చును. మరియు అట్టి మార్పును సంబంధిత యూనికోర్ సంఖ్యగల వ్యక్తికి తెలియజేయవలెను.

(3) ప్రాధికార సంస్థ, ఒక వ్యవహారానికి అనుషంగికంగా లేదా ఆవశ్యకం చేయగల అంశంగా లేదా కోర్ డిజిటల్ డేటాకు చెందిన ఏదేని అంశాన్ని మార్పు చేసే ప్రభావాన్ని కలిగి ఉన్న పర్యవసానంగా కోర్ డిజిటల్ డేటాలో మార్పు చేయడానికి వినియమము ద్వారా అనుమతించవచ్చును. మరియు, అట్టి అన్ని సందర్భాలలో, ప్రాధికార సంస్థచే నిర్వహించబడు కోర్ డిజిటల్ డేటా చలామణిలో ఉండి, అట్టి డేటా విషయంలో సత్యసంధతకు ఏకాధారంగా ఉండేటట్లు దానిని ఎల్లప్పుడూ నిర్వహించే విధంగా చూడడానికి గానూ, పైమార్పును ఏకకాలంలో పంపబడిన తరువాత మరియు ప్రాధికార సంస్థకు చెందిన డేటాబేస్‌లలోని మరియు అట్టి కోర్ డిజిటల్ డేటా యజమానికి చెందిన స్వయంచలన రీతిలో మాత్రమే పైన పేర్కొన్నట్టి లావాదేవీలు పూర్తి చేయబడేటట్లు ప్రాధికార సంస్థ చూడవలసి ఉంటుంది.

(4) ఉపపరిచ్ఛేదము (3) యొక్క ఆవశ్యకతల ప్రభావం కలిగించడానికి సముచితమైన ప్రక్రియలలో ఇన్‌టర్ ఫేసెసు మరియు ప్రమాణాల వర్తింపును ప్రాధికార సంస్థ వినియమముల ద్వారా విహితపరచవలెను.

26. (1) 23వ మరియు 24వ పరిచ్ఛేదములలో ఉన్నదేదియు జిల్లా జడ్జి హోదాకు తక్కువగాని న్యాయస్థానపు ఉత్తరువును పురస్కరించుకొని చేయబడిన సమాచారపు గుర్తింపు లేదా రికార్డుల ప్రమాణీకరణతో సహా ఏదేని సమాచారము వెల్లడిచేయుటకు సంబంధించి వర్తించరాదు.

కొన్ని సందర్భములలో సమాచారమును వెల్లడిచేయుట.

అయితే, ఈ ఉపపరిచ్ఛేదము క్రింద న్యాయస్థానపు ఏ ఉత్తరువుగాని ప్రాధికార సంస్థకు ఆకర్ణించుకొనుటకు అవకాశమిచ్చిననే తప్ప, చేయరాదు.

(2) 23వ పరిచ్ఛేదము లేదా 24వ పరిచ్ఛేదములో ఏమి ఉన్నప్పటికి, ప్రభుత్వ ఉత్తరువు ద్వారా, ఈ విషయములో ప్రత్యేకముగా ప్రాధికారమీయబడిన రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి హోదాకు తక్కువగానట్టి అధికారి యొక్క ఆదేశమును పురస్కరించుకొని, జాతీయ భద్రత హితము దృష్ట్యా చేయబడిన సమాచారపు గుర్తింపు లేదా రికార్డుల అధిప్రమాణీకరణతో సహా ఏదేని సమాచారమును వెల్లడిచేయుటకు వర్తించదు.

## అధ్యాయము - 7

## అపరాధములు మరియు పెనాల్టీలు

27. యూనికోర్ సంఖ్యను కలిగి ఉన్నవ్యక్తికి హానికలిగించు లేదా మోసగించు ఉద్దేశముతో కోర్ డేటాకు లేదా మార్పులు చేసిన లేదా మార్పులు చేయుటకు ప్రయత్నించిన వారెవరైనను, ఒక సంవత్సరము వరకు విస్తరించగల కారావాసముతో లేదా పదివేల రూపాయల వరకు ఉండగల జరిమానాతో శిక్షింపబడదగి ఉండవలెను.

చేరు సమయంలో మరొక వ్యక్తిగా ప్రవర్తించినందుకు పెనాల్టీ.

28. ఈ చట్టపు నిబంధనల క్రింద కోర్‌డేటాను సేకరించుటకు ప్రాధికారమీయబడని వారెవరైనను, మాటలతో, ఆ విధముగా చేయుటకు ప్రాధికారమీయబడినట్లుగా నటిస్తూ లేదా ప్రవర్తించిన వారెవరైనను, ఒక సంవత్సరము వరకు విస్తరించగల కారావాసముతో లేదా పదివేల రూపాయల వరకు ఉండగల జరిమానాతో లేదా ఒక కంపెనీ అయిన సందర్భములో ఒక లక్ష రూపాయల వరకు విస్తరించి ఉండగల జరిమానాతో లేదా రెండింటితో శిక్షించబడదగి ఉండవలెను.

మరొక వ్యక్తిగా వ్యవహరించినందుకు పెనాల్టీ.

29. ప్రాధికార సంస్థచే ప్రాధికారమీయబడని వారెవరైనను ఉద్దేశపూర్వకముగా,-

కోర్ డిజిటల్ డేటాను అనధికారికంగా కలిగి ఉన్నందుకు పెనాల్టీ.

(ఎ) కోర్ డిజిటల్ డేటా రిపోజిటరీకి సంబంధము కలిగివున్న లేదా సంబంధమును పొందిన;

(బి) రిపోజిటరీ నుండి లేదా తొలగించదగిన ఏదేని స్టోరు చేయబడిన మాధ్యమము నుండి డేటాలోడులు, కాపీలు లేదా ఉదాహృతులను;

(సి) రిపోజిటరీలో ఏదేని వైరస్ లేదా కంప్యూటరులో మలినకారకము కలిగినపుడు లేదా కలుగజేయుటకు ప్రయత్నించినపుడు;

(డి) రిపోజిటరీలోని డేటాకు హానిచేయరాదు లేదా హానిచేయుటకు ప్రయత్నించరాదు;

(ఇ) రిపోజిటరీకి భంగము కలిగించరాదు లేదా భంగము కలిగించుటకు ప్రయత్నించరాదు;

(ఎఫ్) రిపోజిటరీ విషయంలో ప్రాధికారమీయబడిన ఎవరేని వ్యక్తిని నిరాకరించిన లేదా నిరాకరించుటకు అనుమతించరాదు;

(జి) చట్టమును ఉల్లంఘిస్తూ ఏదేని కోర్ డేటాను వెల్లడించరాదు, పాలుపంచుకొనరాదు, ఉపయోగించరాదు; లేదా

(హెచ్) హాని కలిగించు ఉద్దేశముతో ప్రాధికార సంస్థచే ఉపయోగించబడిన ఏదేని కంప్యూటరు సోర్సును దొంగిలించరాదు, మరుగుపరచరాదు, ధ్వంసము చేయరాదు, లేదా మార్పులు చేయరాదు లేదా సదరు పనులను చేయుటకు ఎవరేని వ్యక్తిని ప్రోత్సహించరాదు. ఆ విధముగా చేసిన వారెవరైనను ఒక సంవత్సరము వరకు విస్తరించగల కారావాసముతో లేదా ఒక లక్ష రూపాయలకు తక్కువకాని జరిమానాతో శిక్షించబడదగి ఉండవలెను.

అభ్యర్థించిన సంస్థచే అనధికారికంగా ఉపయోగించినందుకు పెనాల్టీ.

30. ఈ చట్టమును ఉల్లంఘిస్తూ కోర్‌డేటాను ఉపయోగించుటకు అభ్యర్థించు వారెవరైనను ఒక సంవత్సరము వరకు విస్తరించగల కారావాసముతో లేదా పదివేల రూపాయల వరకు ఉండగల జరిమానాతో, అది ఒక కంపెనీ అయినచో ఒక లక్షరూపాయల వరకు ఉండగల జరిమానాతో లేదా రెండింటితో శిక్షించబడదగి ఉండవలెను.

తెలియజేయు ఆవశ్యకతలను పాటించనందుకు పెనాల్టీ.

31. కోర్‌డేటా సేకరణ ఏజెన్సీ లేదా అభ్యర్థించిన వ్యక్తి ఈ చట్టపు ఆవశ్యకతలను పాటించుటలో వైఫల్యము చెందిన వారెవరైనను ఒక సంవత్సరము వరకు విస్తరించగల కారావాసముతో లేదా పదివేల రూపాయల వరకు ఉండగల జరిమానాతో, లేదా ఒక కంపెనీ అయినయెడల ఒక లక్ష రూపాయల వరకు ఉండగల జరిమానాతో లేదా రెండింటితో శిక్షించబడదగి ఉండవలెను.

సాధారణ పెనాల్టీ.

32. ఈ చట్టము క్రింద లేదా అందుచేయబడిన నియమములు లేదా వినియమముల క్రింద మరియు ఈ పరిచ్ఛేదములో ఎక్కడను ఎట్టి నిర్దిష్టమైన పెనాల్టీ విధించబడని సందర్భములో, అపరాధముచేసిన వారెవరైనను ఒక సంవత్సరము వరకు విస్తరించగల కారావాసముతో లేదా ఇరవై ఐదువేల రూపాయలతో లేదా ఒక కంపెనీ అయిన యెడల ఒక లక్ష రూపాయల వరకు ఉండగల జరిమానాతో లేదా రెండింటితో శిక్షించబడదగి ఉండవలెను.

భారతదేశం వెలుపల ఉల్లంఘునకు లేదా చేయబడిన అపరాధమునకు చట్టము వర్తించుట.

33. (1) ఉపపరిచ్ఛేదము (2) యొక్క నిబంధనలకు లోబడి, ఈ చట్టపు నిబంధనలు, జాతీయతతో సంబంధము లేకుండా ఎవరేని వ్యక్తి భారతదేశం వెలుపల ఏదేని అపరాధమును చేసిన లేదా ఉల్లంఘునను జరిపినయెడల కూడా వర్తించవలెను.

(2) ఉపపరిచ్ఛేదము (1) యొక్క ప్రయోజనముల నిమిత్తము, ఈ చట్టపు నిబంధనలు, భారతదేశం వెలుపల ఏదేని అపరాధమును ఎవరేని వ్యక్తి చేసినపుడు లేదా ఉల్లంఘున జరిపినపుడు, రిపోజిటరీలో ఏదేని డేటాకు సంబంధించిన అపరాధము లేదా ఉల్లంఘునకు సంబంధించిన చర్యకు వర్తించవలెను.

అపరాధము యొక్క సంజ్ఞేయము.

34. (1) ఏదేని ప్రాధికార సంస్థచే లేదా దానిచే ప్రాధికారమీయబడిన ఎవరేని అధికారి లేదా వ్యక్తిచే ఫిర్యాదు చేయబడిననే తప్ప. ఈ చట్టము క్రింద శిక్షించబడదగు ఏదేని అపరాధమును ఏ న్యాయస్థానము సంజ్ఞేయము చేయరాదు.

(2) చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు లేదా చీఫ్ జుడీషియల్ మేజిస్ట్రేటు హోదాకు తక్కువగానట్టి ఏ న్యాయస్థానము ఈ చట్టము క్రింద శిక్షించబడదగు అపరాధమును విచారణ జరుపరాదు.

## అధ్యాయము - 8

## వివిధములు.

ఆదేశములు జారీ చేయుటకు రాష్ట్ర ప్రభుత్వ అధికారము.

35. (1) ఈ చట్టము యొక్క పై నిబంధనల వ్యాపకతకు భంగము వాటిల్లకుండా ప్రాధికార సంస్థ, ఈ చట్టము క్రింది తన అధికారములను వినియోగించుటకు లేదా తన కృత్యములను నిర్వర్తించుటకు, రాష్ట్ర ప్రభుత్వము ఆయా సమయములందు వ్రాతపూర్వకముగా ఇచ్చునట్టి ఆదేశములకు బద్ధమై ఉండవలెను;

అయితే, ప్రాధికార సంస్థ, ఆచరణ సాధ్యమైనంత వరకు ఈ ఉపపరిచ్ఛేదము క్రింద ఏదేని ఆదేశము నిచ్చుటకు ముందు తన ఉద్దేశమును వెల్లడించుటకు అవకాశమును నీయవలెను;

అంతేకాక, ఈ పరిచ్ఛేదములో నున్నదేదియు, ప్రాధికార సంస్థ సాంకేతిక లేదా చేపట్టిన పరిపాలన విషయాలలో ఆదేశములను జారీచేయుటకు రాష్ట్ర ప్రభుత్వమునకు అధికారమునీయదు.

(2) రాష్ట్ర ప్రభుత్వము యొక్క నిర్ణయము అంతమైనదై ఉండవలెను.

ప్రత్యాయోజనము.

36. ప్రాధికార సంస్థ, వ్రాతపూర్వకమైన సాధారణ లేదా ప్రత్యేక ఉత్తరువు ద్వారా, అందు నిర్దిష్టపరచునట్టి ఏవేని షరతులు ఉన్న యెడల వాటికి లోబడి, ఈ చట్టము క్రింద తాను అవసరమని భావించునట్టి తన యొక్క అధికారములు మరియు కృత్యములను, ప్రాధికార సంస్థ యొక్క ఎవరేని సభ్యునికి, అధికారికి లేదా ఎవరేని ఇతర వ్యక్తికి ప్రత్యాయోజనము చేయవచ్చును.

సద్భావముతో తీసుకొనిన చర్యకు రక్షణ.

37. ఈ చట్టము లేదా అందుచేయబడిన నియమము లేదా వినియమము క్రింద సద్భావముతో చేసిన లేదా చేయుటకు ఉద్దేశించిన దేనికైనను రాష్ట్ర ప్రభుత్వము లేదా ప్రాధికార సంస్థ లేదా ప్రాధికార సంస్థ యొక్క ఛైర్ పర్సన్ లేదా ఎవరేని సభ్యుడు లేదా ఎవరేని అధికారి లేదా ఇతర ఉద్యోగులపై ఏ న్యాయస్థానముగాని ఎట్టి దావా లేదా అభియోగము లేదా ఇతర శాసనిక చర్య తీసుకొనరాదు.

నియమములు చేయుటకు రాష్ట్ర ప్రభుత్వమునకు గల అధికారము.

38. (1) రాష్ట్ర ప్రభుత్వము, అధిసూచన ద్వారా, ఈ చట్టము యొక్క నిబంధనలను అమలుపరచు నిమిత్తము నియమములను చేయవచ్చును.

(2) ఈ చట్టము క్రింద చేసిన ప్రతి నియమమును అది చేసిన వెంటనే అపుడు రాష్ట్ర శాసనమండలి అధివేశనమునందున్నచో, ఆ అధివేశములోను, అది అధివేశనములో లేనిచో అవ్యవహితానంతర అధివేశనములోనూ దాని సమక్షమున మొత్తము పదునాలుగు దినముల కాలావధిపాటు ఉంచవలెను. ఆ కాలావధి ఒకే అధివేశములోగాని, రెండు అనుక్రమ అధివేశనములలోగాని చేరి ఉండవచ్చును. అట్లు దానిని ఉంచిన అధివేశనముగాని, దాని అవ్యవహితానంతర అధివేశనముగాని ముగియు లోపల రాష్ట్ర శాసనమండలి వాటిలో ఏదేని మార్పుచేయుటకు లేక ఆ నియమమును రద్దుచేయుటకు అంగీకరించినచో, ఆ మార్పు లేక రద్దు అధిసూచింపబడు తేదీ నుండి, అవి అట్లు మార్పు చేయబడిన రూపంలో మాత్రమే అమలు కలిగిఉండును లేక సందర్భానుసారముగ రద్దగును. అయినప్పటికినీ ఏదేని అట్టి మార్పుగాని, రద్దుగాని వాటి క్రింద అంతకు పూర్వం చేయబడిన దేని శాసనమాన్యతకైనను భంగము కలిగించదు.

వినియమములు చేయుటకు రాష్ట్ర ప్రభుత్వ అధికారము.

39. ప్రాధికార సంస్థ అధిసూచన ద్వారా, ఈ చట్టమునకు మరియు అందుచేయబడిన నియమములకు సంగతముగా ఉండునట్టియు ఈ చట్టము యొక్క నిబంధనలను నెరవేర్చుటకు వినియమములను చేయవచ్చును.

ఇతర శాసనముల వర్తింపుకు అడ్డంకి కాకుండుట.

40. ఈ చట్టము యొక్క నిబంధనలు, ప్రస్తుతము అమలునందున్న ఏదేని ఇతర శాసనము యొక్క నిబంధనలను న్యూనతపరచునవిగా లేకుండా, వాటికి అదనముగా ఉండవలెను.

చిక్కులు తొలగించుటకు అధికారము.

41. (1) ఈ చట్టపు నిబంధనలు అమలుపరచుటలో ఏదేని చిక్కు ఏర్పడినపుడు, సదరు చిక్కును తొలగించు నిమిత్తము ఈ చట్టపు నిబంధనలకు అసంగతముగా లేనట్టి విధముగా, ఆంధ్రప్రదేశ్ గెజెటులో రాష్ట్ర ప్రభుత్వము ఉత్తరువు ద్వారా అట్టి నిబంధనలను చేయవచ్చును.

అయితే, ఈ చట్టము ప్రారంభము నుండి మూడు సంవత్సరములు గడచిన తరువాత, ఈ పరిచ్ఛేదము క్రింద ఎట్టి ఉత్తరువును చేయరాదు.

(2) ఈ పరిచ్ఛేదము క్రిందచేయబడిన ప్రతి ఉత్తరువు అది చేయబడిన సాధ్యమైనంత వెంటనే శాసనమండలి యొక్క ప్రతి సదనము సమక్షమున ప్రవేశపెట్టబడవలెను.

## ఉద్దేశాలు - కారణాలు

ప్రజలు, భూమి భౌగోళిక సమాచారం, సంస్థలు మరియు ఉద్భవిస్తున్న అంతర్జాతీయ వస్తువుల రంగం (ఐఓటి)లో కోర్ డిజిటల్ డేటా గుర్తింపు అధిప్రమాణీకరణకు విశ్వసనీయమైన విధానం అందుబాటులో లేదు. కోర్ డేటాను, తన జీవన చక్రంలో సమర్థవంతంగా నిర్వహిస్తేనేగాని, దాని దుర్వినియోగము లేదా నిరుపయోగము జరిగే అవకాశమున్నందున, పరిపాలన మరియు సమాజంపై అది వ్యతిరేక ప్రభావాన్ని కలిగిస్తుంది.

పై విషయం దృష్ట్యా, ప్రభుత్వము కోర్ డిజిటల్ డేటాపై సమగ్రమైన శాసనాన్ని చేయాలని నిర్ణయించడం జరిగింది. ప్రాధికార సంస్థ, ఇతర విషయాలతో పాటు, ఈ క్రింది వాటి కొరకు నిబంధించదలచు చున్నది,-

(ఎ) పెరుగుతున్న డేటా పరిమాణము : ప్రభుత్వములో ఐటి వినియోగం విస్తృత స్థాయిలో అధికమౌతున్నందున, డేటా పరిమాణము మరియు దాని రకములు ఇతోధికముగా అధికమవుతున్నది. టాబ్లెట్లు, మరియు మొబైల్ ఫోన్లు ద్వారా సేకరించిన డేటా మరియు వివిధ సర్వర్లలో నిల్వచేసిన డేటా అంతయు ఇతర మాస్ డేటాతో కలిసి, ఉపయోగకరమైనట్టి మరియు కోర్ డేటా నష్టపోకుండా, డేటా సెట్లన్నింటిని సమర్థవంతంగా నిర్వహించుకోవలసిన అవసరం ఎంతగానో ఉన్నది.

(బి) డేటా మేనేజ్‌మెంటు ఎంతో బాధ్యతాయుతమైన చర్య : ఎంతో పరిమాణం గలిగిన డేటాను మేనేజ్ చేయడం ప్రభుత్వానికి తలకు మించిన భారంగా తయారైంది. అది ప్రజలు, భూమి, భౌగోళిక సమాచారం, సంస్థలు మరియు ఉద్భవిస్తున్న ఐఓటి రంగం సాధనములపై కోర్‌డిజిటల్ డేటా విషయంలో మరింత ఎక్కువ ప్రభావం కలిగిస్తున్నది. కోర్‌డేటా జీవన చక్రాన్ని తగినంత సమర్థవంతంగా నిర్వహించిననే గాని అది, దుర్వినియోగం మరియు నిరుపయోగానికి దారితీసే ప్రభావం వలన పరిపాలన మరియు సమాజంపై విపరీతమైన విపత్కర పరిస్థితులు నెలకొనేటట్లు చేయగలదు.

(సి) క్రమబద్ధం చేయవలసిన అవసరం : భౌతిక మాధ్యమంపై డేటా నిర్వహణ, డిజిటల్ డేటా ఒకదాని కొకటి విలక్షణంగా ఉండి, క్షణకాలంలో అన్ని దిశలకు తేలికగా సాగే లక్షణంతో ఉండుట వలన, అది సులభంగా, దుర్వినియోగ పరిచేవారికి తేలికగా లభ్యమై విపత్కర పరిస్థితులకు లోనుకాగలదు. డిజిటల్ రూపంలో ఉండుట వలన, అనేక మరియు వివిధ మార్గాలలో అవాంఛిత ప్రయోజనాలకు ఉపకరించే ప్రమాదం కూడా పొంచి ఉంటుంది. అందుచేత దానిని క్రమబద్ధమైన యంత్రాగానికి జోడించవలసిన అవసరం ఎంతో ఉన్నది.

(డి) భద్రత : సమాచార పద్ధతుల భరణ విధానం యజమానులు, దాని అభిరక్షకులు తీసుకొనే భద్రత చర్యలపై ఎంతగానో ఆధారపడి ఉన్నది కోర్ డిజిటల్. డేటా విషయంలో అట్టి చర్యలు మరియు భద్రతలు శాసనిక రూపంలో ఉంటే మరింత పటిష్ఠవంతంగా ఉండేందుకు వీలవుతుంది.

(ఇ) గోప్యత : ప్రభుత్వము ఎన్నో రకాలైన డేటాతో వ్యవహరించడం జరుగుతుంది. అందు వ్యక్తిగతంగా గుర్తించదగిన సమాచారం (పిఐఐ) మరియు ఎంతో సునిశితమైన డేటా కూడా చేరి ఉంటుంది. అందుచేత అట్టి సమాచారపు గోప్యతను రక్షించుకోడానికి భద్రత చర్యల ఆవశ్యకత ఎంతగానో ఉన్నది.

(ఎఫ్) కోర్ డిజిటల్ డేటా, ఈ సర్వీసులకు పునాదిగా ఏర్పడుట : ఈ-పరిపాలనకు ఏదైనా పటిష్ఠమైన విధానం ఉన్నదంటే- అది సుస్థిరమైన కోర్ డిజిటల్ డేటా పునాదే. దానిని వాస్తవ సింగిల్ సోర్సుగా నిర్వహించవలసి ఉండుట. బహుళ సెట్లుగా డేటా ఉండుట వలన అవే సంస్థలు, సమర్థతలేని మరియు స్థోమతలేనివిగా తయారై చివరకు ఐటి విధానము కుప్పకూలిపోయే ప్రమాదం సంభవించగలదు.

ఈ బిల్లు, పై లక్ష్యములను సాధించుటకు ఉద్దేశిస్తున్నది.

**పల్లె రఘునాథ రెడ్డి,**
సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ &
కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి.

## ఆర్థిక వివరణ

ఆంధ్రప్రదేశ్ కోర్ డిజిటల్ డేటా ప్రాధికార సంస్థ బిల్లు లోని 21వ పరిచ్ఛేదము ఆర్థిక విషయాల గురించి తెలియజేస్తుంది (ఈ-సేవలను సమర్థవంతంగా నిర్వహించుటకు). మౌలిక సదుపాయాలూ మరియు కోర్ డిజిటల్ డేటా కల్పన (సిడిడి) కి మొదటి సంవత్సరానికి రూ.200.00 కోట్లు ఖర్చు కాగలదని అంచనా వేయబడింది. నిర్వహణ ఖర్చు వార్షికంగా , రెండవ సంవత్సరము నుండి అదనంగా రూ.50.00 కోట్లు ఉండగలదని అంచనా వేయడం జరిగింది. ఈ వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది.

పల్లె రఘునాథ రెడ్డి,
సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ &
కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి.

## ప్రదత్త శాసన నిర్మాణమును గురించిన వివరణ.

బిల్లులోని ఖండములు 1, 2 (క్యూ), 10, 13, 16, 20, 22, 38, 39 మరియు 41 వాటిలో నిర్దిష్టపరచిన విషయాలకు సంబంధించి అధిసూచనలు జారీచేయుటకు, నియమములను చేయుటకు మరియు సాధారణముగా ఈ చట్టపు ప్రయోజనాలను నెరవేర్చుటకు ప్రభుత్వమునకు ప్రాధికారమిచ్చుచున్నవి. అట్లు జారీచేయబడిన అధిసూచనలు మరియు చేయబడిన నియమములు చాలావరకు ప్రక్రియాపరమైన స్వభావము గల విషయాలకై ఉద్దేశించినవే. వాటిని రాష్ట్ర శాసన మండలి ఉభయ సదనముల యొక్క సమక్షంలో ఉంచవలెను. మరియు అవి శాసనమండలి చేయు ఏవేని మార్పులకు లోనై ఉండును.

కనుక, ప్రదత్త శాసన నిర్మాణమునకు సంబంధించిన బిల్లులోని పై నిబంధనలు సాధారణమైనవి మరియు ప్రధానముగా ప్రక్రియాపరమైన విషయముల కొరకు ఉద్దేశింపబడినవి.

**పల్లె రఘునాథ రెడ్డి,**
సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ &
కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి.

**ఆంధ్రప్రదేశ్ శాసనసభ కార్యకలాప ప్రక్రియ మరియు నిర్వహణ నియమావళిలోని 95వ నియమము క్రింద వివరణ.**

ఆంధ్రప్రదేశ్ కోర్ డిజిటల్ డేటా ప్రాధికార సంస్థ (ఈ-సేవలను సమర్థవంతంగా నిర్వహించేందుకైన) బిల్లు, 2017ని, రాష్ట్ర శాసనమండలి ఆమోదించిన పిమ్మట, భారత సంవిధానము యొక్క 200వ అనుచ్ఛేదము క్రింద అనుమతి నిమిత్తము గవర్నరుకు సమర్పించవలెను.

**పల్లె రఘునాథ రెడ్డి,**
సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ &
కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి.

**కె. సత్యనారాయణ రావు,**
రాష్ట్ర శాసన మండలి కార్యదర్శి (ఇన్‌ఛార్జి).

Printed by the Commissioner of Printing, at A.P. Legislative Assembly Printing Press, Amaravati.